క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

గోపాలపురం: మండలంలోని సగ్గొండలోని 133/11 కేవీ విద్యుత్తు ట్రాన్స్‌కో టవర్ నిర్మాణం కోసం శనివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ సరఫరాను నిలుపుదల చేస్తామని ట్రాన్స్‌కో నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా సగ్గొండ పరిధిలోని రాంపాలెం, హుకుంపేట, సగ్గొండ, గోపవరం గ్రామాలకు, వ్యవసాయ మోటార్లకు శనివారం విద్యుత్తు సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

నేడు మంచినీటి సరఫరా నిలుపుదల

నిడదవోలు: స్థానిక నెహ్రూనగర్ మంచినీటి రిజర్వాయర్ పరిధిలో కొత్త మంచినీటి పైప్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నందున శనివారం మంచినీటి సరఫరాను నిలిపి వేసినట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి గణపతి సెంటర్ వరకూ పాత పైప్‌లైన్ తొలగించి కొత్త పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. దీంతో నెహ్రూనగర్ మంచినీటి ట్యాంక్, బాలాజీ నగర్ మంచినీటి ట్యాంక్ పరిధిలో 1వ వార్డు నుండి 11వ వార్డు వరకు, 13వ వార్డు నుంచి 16వ వార్డు వరకు, 21, 22, 24వ వార్డులకు మంచినీరు సరఫరా తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామన్నారు.

కొండచిలువ హతం



చిక్కాల వాసులు హతమార్చిన కొండచిలువ

చాగల్లు: చిక్కాల గ్రామంలోని కొవ్వాడ కాలువ సమీపంలో శుక్రవారం కొండ చిలువ హల్‌చల్ చేసింది. సమీప పొలాల్లో పనులు చేసుకుంటున్న కూలీలు, రైతులు దానిని చూసి హతమార్చారు. కొంతకాలంగా ఈ ప్రాంత పొలాల్లో కొండచిలువలు తిరుగుతున్నాయని రైతులు అంటున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లిన సందర్భంలో కొండ చిలువల సంచారం చూసి భయపడుతున్నారు. గతంలో ఒక కొండ చిలువను చంపగా శుక్రవారం మరొకటి రావడంతో ఈ ప్రాంతవాసులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలోని కొండ చిలువలను పట్టుకుని అడవుల్లో విడిచి పెట్టాలని వారు కోరుతున్నారు.

10 మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

గోపాలపురం: అనుమతి లేకండా మద్యం విక్రయిస్తున్న మండలంలోని రేగులగుంట గ్రామానికి చెందిన మీసాల రామారావు అనే వ్యక్తికి ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేశారు. అతడి ఇంటి వద్ద లభించిన 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ దేవరపల్లి సీఐ డి.సుధ శుక్రవారం తెలిపారు. నిందితుడ్ని కొవ్వూరు కోర్టులో హాజరు పరచగా, జడ్జి రిమాండ్ విధించినట్టు ఆమె తెలిపారు.

కేంద్రం ఎరువుల రేట్లు తగ్గించాలి

చాగల్లు: కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎరువుల రేట్లు తగ్గించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు చాగల్లులో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఇప్పటికే అధిక కౌలు, పెరిగిన పెట్టుబడులతో కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో రైతులు అల్లాడిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కౌలు రైతు సంఘం అధ్యక్షుడు రామనాథ మురళీకృష్ణ, తోలేటి గన్నియ్య, శ్రీరంగం రాము, పిడుమి పల్లంరాజు, కంకటాల బుద్ధుడు, జుజ్జువరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



గజ్జరం వాసులకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న పోలింగ్ అధికారులు

తాళ్లపూడి: ఈవీఎంల పనితీరుపై గజ్జరం గ్రామంలో శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల సాయంతో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. తమ ఓటు ఎవరికి వేశామో, తప్పుగా పడిందా లేక ఒకరికి వేస్తే మరొకరికి వెళ్లిందా వంటి ఓటర్ల సందేహాలను తీర్చడం కోసం ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు వారీ డెమో నిర్వహించారు. నియోజక వర్గ కో–ఆర్డినేటర్ జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వచ్చి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ నెల 12 వరకూ మండలంలో డెమో మెషీన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి రాంబాబు, బూత్ లెవెల్ అధికారులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

మాట తప్పని నేత జగన్

- చరిత్రలో నిలిచిపోతారు
- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పండగలా పెంచిన, కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ



నల్లజర్లలో వైఎస్సార్ పెన్షన్ కానుక అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ఉండ్రాజవరంలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నల్లజర్ల: మాటతప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పెంచిన సామాజిక పింఛన్లు, కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీతో గ్రామాల్లో ముందుగానే సంక్రాంతి పండగ వాతావరణం నెలకొంది. నల్లజర్ల గ్రామ సచివాలయం -1 వద్ద శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీఓ రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో 99 శాతం హామీలను ముఖ్యమంత్రి ఇప్పటికే అమలు చేశారన్నారు. రూ.2 వేల పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారని, దేశంలో మరెక్కడా ఇంత మొత్తంలో పింఛన్ ఇవ్వడం లేదన్నారు. జగనన్నను మరో ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే తలారి కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం మద్దిపాటి ప్రసాద్, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పింఛను మొత్తాన్ని రూ.3,000కు పెంచి ఎన్నికల హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఉండ్రాజవరం నంబర్–1 ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తన ప్రసంగంలో గత నాలుగున్నరేళ్లుగా జగన్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 39 లక్షల మందికి మాత్రమే పింఛన్ అందిస్తూ సగటున నెలకు రూ.400 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 66.34 లక్షల మందికి పింఛన్ అందిస్తూ సగటున నెలకు రూ.1,968 కోట్లను ఖర్చు చేస్తోందన్నారు. అనంతరం మండలంలో కొత్తగా మంజూరైన 177 మంది పింఛన్‌దారులకు రూ.3 వేల చొప్పున పింఛన్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల్లో ఎనిమిదో తరగతికి చెందిన 140 విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను శుక్రవారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘నాడు–నేడు’ పథకంలో ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీలు ఎస్.సరోజ, చెట్టే నవీన్, వైఎస్సార్ సీపీ యూత్ ప్రెసిడెంట్ గంటిన గణపతి, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్ధరాజు, మండల రైతు విభాగం అధ్యక్షుడు కొఠారు సత్యనారాయణ, ఎంపీడీవో జి.ఆర్‌కే రాజు, ఎంఈవో సక్సేనా రాజు, పాఠశాల చైర్మన్ కర్రెళ్ల సోంబాబు, హెచ్ఎం విశ్వప్రసాద్, ఆయా పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో 1127 మంది లబ్ధిదారులకు పెన్షన్ నగదును వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, నాయకులు నాగు, అంబేద్కర్, అంగర శ్రీను, రహీమ్, గెడ్డం రవీంద్రబాబు, ఎ.రమేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు బల్లిపాడులో మండల స్థాయిలో..



పెన్షన్ల పెంపు ఉత్సవాల సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

తాళ్లపూడి: బల్లిపాడులోని కాకర్ల రామయ్య కల్యాణ మండపం ఎదురుగా గల డీవీవీ దానయ్య స్థలంలో శనివారం పెంచిన పెన్షన్ల పంపిణీ వేడుక నిర్వహించనున్నారు. తాళ్లపూడి మండల స్థాయిలో మధ్యాహ్నం రెండున్నర గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం మంత్రి తానేటి వనిత హాజరవుతారని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు శుక్రవారం తెలిపారు. కార్యక్రమం నిర్వహించే ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎంపీపీ పోసిరాజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీ లేఖ, పెద్దేవం, వేగేశ్వరపురం, గజ్జరం సర్పంచులు తిగిరిపల్లి వెంకటరావు, కొమ్మిరెడ్డి పరశురామారావు, గండి రాంబాబు, పార్టీ నాయకులు తోట రామకృష్ణ, వల్లభశెట్టి శ్రీనివాస్, నక్కా చిట్టిబాబు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, నామా ప్రకాశం, ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న తదితరులు పరిశీలించారు.

ఉదయం చాగల్లులో..

కొవ్వూరు: చాగల్లులోని కాపు కల్యాణ మండపం ఎదురుగా గల ఆడిటోరియంలో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు చాగల్లు మండల స్థాయిలో పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కార్యక్రమానికి నియోజకవర్గం పరిధిలో ముఖ్య నాయకులు ,పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నిడదవోలులో జిల్లా స్థాయి నృత్య పోటీలు



కూచిపూడి నృత్య కళాకారిణులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: మన సంప్రదాయ, ప్రాచీన కళలైన కూచిపూడి, భరతనాట్యం వంటి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారున. శ్రీ చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఎస్ టౌన్ హాల్లో గురువారం జిల్లా స్థాయి నృత్య పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. పలువురు కళాకారిణులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీ చైతన్య కళాసమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కళా సమితి అధ్యక్షుడు గోనమోయిన శ్రీరామకృష్ణ పరమహంస, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి వెలగన పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- నిడదవోలు, పెరవలి తహసీల్దార్ల హెచ్చరిక
- వివిధ శాఖల సిబ్బందితో సమావేశం



పెరవలి సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

నిడదవోలు రూరల్: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, గుండాట, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.గంగరాజు హెచ్చరించారు. జూదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాలు, రెవెన్యూ సిబ్బందితో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పండగ సమయంలో సంప్రదాయ ఆటలతో సంతోషంగా గడపాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా కోడిపందేల నిర్వహణకు బరులు సిద్ధం చేస్తే సమాచారం అందించాలని కోరారు. ఎంపీడీఓ పి.శామ్యూల్, ఈఓపీఆర్డీ రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలిలో..

పెరవలి: పండగ పేరుతో జూదాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి స్పష్టం చేశారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు వంటివి జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ, రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బందితో అవగాహన సమావేశం జరిగింది. గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, కోతాట, గుండాట వంటివి నిర్వహిస్తుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ కోరారు. కోడి పందేలు నిర్వాహకులపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఎస్సై ఎం. సూర్య భగవాన్ మాట్లాడుతూ కోడి పందేలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత అలాంటి పోటీల్లో పాల్గొనకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత తను పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, గ్రామపెద్దలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వ విలువలు కలిగి ఉండాలి

- ఎంపీపీ కేవీకే దుర్గారావు
- దేవరపల్లిలో ఘనంగా బాలోత్సవం



దాతల తరఫున బాలోత్సవ కమిటీకి రూ.25 వేల చెక్కు అందిస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: ప్రతి ఒక్కరూ మానవత్వ విలువలు కలిగి ఉండాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి బాలోత్సవం 2వ బడిపిల్లల సంబరాలను శుక్రవారం ఎంపీపీ దుర్గారావు స్థానిక జెడ్పీ హైస్కూల్లో ప్రారంభించారు. బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు బలుసు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో దుర్గారావు మాట్లాడారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రెండేళ్లుగా దేవరపల్లిలో బాలోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. బాలోత్సవ కమిటీకి బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి రూ.25 వేలు విరాళంగా అందించారు. ఈ చెక్కును బాలోత్సవ కమిటీ ప్రతినిధులకు ఎంపీపీ అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి, జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాలోత్సవ పతాకాన్ని బాలోత్సవ కమిటీ మండల గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య ఆవిష్కరించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి భారీగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. బాలలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలలు ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమదాస్, కేఆర్ఎస్ఎస్‌వీ అప్పారావు, హేలాపురి బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, నిర్వాహకులు ఉండవల్లి కృష్ణారావు, ఉస్సే శంకరుడు, జీవీఎల్ నరసింహారావు, గోదావరి బాలోత్సవ కమిటీ కార్యదర్శి తులసి, బండి సూర్యప్రకాశరావు, హెచ్ఎం శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

భూ సర్వేకు సహకరించండి

చాగల్లు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై చాగల్లు పంచాయతీ వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ ఉన్నమట్ల మన శ్శాంతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వందేళ్ల తర్వాత ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ భూ సర్వే నిర్వహిస్తోందన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో భూ సర్వే పూర్తయ్యిందని, మరికొన్ని గ్రామాల్లో ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నామని ఆమె అన్నారు. అందులో భాగంగా చాగల్లులో నిర్వహిస్తున్న సర్వేకు రైతులు, భూ యజమానులు సహకరించాలని కోరారు. ముందుగా రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.ఆనంద్ కుమార్, రీ సర్వే విధానం పై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వేళ్లచింతలగూడెం, దూబచర్లలో వైద్య శిబిరాలు



గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం వంటిదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెం సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. ఈ శిబిరంలో సుమారు 350 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. గుండె సంబంధిత వ్యాధులున్న ఆరుగురిని గుర్తించి, మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి సిఫారసు చేసినట్టు డాక్టర్ ఎస్‌కే కరిష్మా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొళ్ల కుమార్, ఎంపీటీసీ సభ్యుడు సనమండ్ర ముసలయ్య, పంచాయతీ కార్యదర్శి కె. సాంబమూర్తి పాల్గొన్నారు.

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరం శుక్రవారం దూబచర్లలో జరిగింది. ఈసందర్భంగా నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టరు తెల్లం గంగాధరరావు మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్ర వారాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆరు నెలలు పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో 415 మంది రోగులకు పరీక్షలు చేశారు. 14 మందిని రిఫరల్ ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. వైద్య నిపుణులు గూడూరి భరత్ (జనరల్ మెడిసిన్) కె.భాగ్యలక్ష్మి (గైనకాలజిస్ట్) సేవలు అందించినట్టు గంగాధరావు తెలిపారు.

రూ.1.25 కోట్లతో 55 పనులకు ఆమోదం

- మండల పరిషత్ స్థాయీ కమిటీలు ఏర్పాటు
- కొవ్వూరు మండల పరిషత్ పాలకవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు: మండలంలో రూ.1.25 కోట్ల వ్యయంతో 55 పనులు చేపట్టనున్నట్టు ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) తెలిపారు. ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘం, మండల పరిషత్ సాధారణ నిధులతో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. కొవ్వూరు మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ నారాయుడు అధ్యక్షతన జరిగింది. మండలంలో వివిధ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్యశాఖ, వాటర్ షెడ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన ప్రకృతి వనరుల కమిటీకి ఎంపీపీ చైర్మన్‌గాను, వైస్ ఎంపీపీలు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖ ఎంపీటీసీ సభ్యులు యండపల్లి నటరాజరాణి, కంటిపూడి నవ్యశ్రీ , మద్దిపాటి అరవింద సభ్యులుగా నియమితులయ్యారు.

మౌలిక సదుపాయాల కమిటీకి ఎంపీపీ అధ్యక్షుడిగా సభ్యులుగా దేవన అనంతలక్ష్మి, నడింపల్లి అప్పారావు, యలమర్తి శ్రీరామప్రసాద్, రెల్లా సరస్వతి, జొన్నకూటి రోహిణి కోమలి, ఇంజేటి మౌనిక పనిచేస్తారు. ఈ కమిటీ రహదారులు ,మౌలిక సదుపాయాలు, కల్వర్టులు, డ్రెయిన్‌లను పర్యవేక్షిస్తుంది. మానవ వనరుల కమిటీకి చైర్మన్‌గా ఎంపీపీ, సభ్యులుగా కోనాల భవాని, వాడవెల్లి వెంకట సూర్యనారాయణ, అంబటి నాగరాజు, పసలపూడి తాతారావు, అల్లు అమరావతి, ఎరుబండి సురేష్‌లు వ్యవహరిస్తారని ఎంపీడీవో కె.సుశీల ప్రకటించారు. ఈ కమిటీ విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, స్త్రీశిశు సంక్షేమం, వికలాంగుల సంక్షేమాన్ని పర్యవేక్షిస్తుందన్నారు. దొమ్మేరు, పశివేదల, తోగుమ్మి గ్రామాల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి, ఉపాధి హామీ పథకం ద్వారా 73 పనులు చేపట్టేందుకు రూ.18.18 లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. దొమ్మేరు, ఐ.పంగిడి,లో రూ.29.62లక్షల ఉపాధి హామీ నిధులతో 65 పనులను చేపట్టాలని తీర్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖ, ఎంపీడీవో కె.సుశీల పాల్గొన్నారు.

రూ.70 కోట్లతో వాటర్ ట్యాంకుల నిర్మాణం



అన్నవరప్పాడులో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, అధికారులు

పెరవలి: జల్‌జీవన్ మిషన్ కింద రూ.70 కోట్ల వ్యయంతో నిడదవోలు నియోజకవర్గంలోని 56 గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు, పైప్ లైన్ విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అన్నవరప్పాడులో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను, పాత ట్యాంక్ లీకేజీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులోని 20 ఏళ్ల వరకూ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేలా ఈ వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్లు నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 30 ట్యాంకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వాటిలో మూడింటి నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. వచ్చే నెల నాటికి అన్నింటినీ పూర్తి చేసేలా ప్రణాళికబద్ధంగా వేగంగా నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. అన్నవరప్పాడులో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే ఈ గ్రామంలో 1.20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల ఒక వాటర్ ట్యాంక్ ఉందని, కొత్తగా మరొకటి నిర్మిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఏఈ సాయి కుమార్, పంచాయతీ సర్పంచ్ పంతం బాలసుందరి, వైఎస్సార్ సీపీ నాయకుడు పంతం సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మండల సమైఖ్య అధ్యక్షురాలిగా స్వరూపరాణి



నూతన అధ్యక్షురాలు స్వరూపరాణిని అభినందిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: మండల సమైఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షురాలిగా ఆగర్తి స్వరూపరాణి, ఉపాధ్యక్షురాలిగా భీమనాది సూర్యనాగలక్ష్మి, కార్యదర్శిగా నేకూరి పద్మ, సంయుక్త కార్యదర్శిగా వీరమళ్ళ కుమారి, కోశాధికారిగా సుందర మంగతాయారు, కార్యవర్గ సభ్యులుగా మరో ఐదుగురు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. మండల సమైఖ్య పరిధిలో 1700 సంఘాలు, గ్రామ సంఘాలు 55 ఉన్నాయి. ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో రహదారులను శరవేగంగా అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. జేఎన్ రోడ్డు నుంచి ఏవీఏ రోడ్డు వరకూ రూ.1.96 కోట్లతో 1.3 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విపర్తి వేణుగోపాల్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా తీర్చిదిద్దాలి

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నగర పాలక సంస్థ శానిటరీ అధికారులు, సిబ్బంది సహకరించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో వారితో సమీక్షించారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓ వినూత్నకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె, పరిష్కారం అనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయమని, వీరి సమ్మె వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిగా తనపై ఉందన్నారు.